ఇదొక నిదర్శనం.

నల్లమేక ఉరికినప్పుడే, ఆఫీసరుగారి నౌకర్ యొక్క కుడికాలి పాతచెప్పుకు కుట్టు తెగింది.

చెప్పు తెగేసరికి అతగాడు "సచ్చేన్రా బగవంతుడా" అనుకున్నాడో, "బతికించేవ్రా బగమంతుడా" అనుకున్నాడో ఎవరికీ వినిపించలేదు. ఏదో గొణుక్కుంటూ, చెప్పు ఎక్కడ తెగిందో చూచుకొందికి వంగున్నాడు.

శరవేగం గంటకు పదిహేను మైళ్ళయితేనే ఆ మోటారుకారు శరవేగంతో వస్తోందని చెప్పడానికి అవకాశం ఉంది కాని, ఆ వేగం, ట్రాఫిక్ పోలీసువారు ఆ రోడ్డుకి నిర్ణయించిన కార్ల వేగానికి చాలా తక్కువలోనే ఉంది.

ఆర్నెల్ల క్రితం అరవంద రూపాయలు జుల్మానా కింద చెల్లించేడు డ్రైవరు. అతనికి ఒక పెళ్ళాం, అరడజను పిల్లలూ వున్నారు. నెలకి నలభై రూకల జీతం ఉంది. అతని "మోటో".

తస్మాత్ జాగ్రత జాగ్రత!!

మోటార్ని ఎంతో జాగ్రత్తగా నడిపించుకు వస్తోన్న డ్రైవర్ కళ్ళముందు నల్లమేక అకస్మాత్తుగా మెరుపులా మెరియడం జరిగింది.

వంగున్న మనిషి వంగోడంచేత డ్రైవరు కంటపడ్డం జరిగింది కాదు.

స్టీరింగు చటుక్కున తిప్పేడు డ్రైవరు.

మేక కారుకింద పడనందుకు అతనింకా నిట్టూర్చకుండానే కొబ్బరికాయ కొట్టిన చప్పుడు.

అరే ఉరే అర్రె!

ఒరే ఆగు ఆగాగు, చచ్చేడు.

కారాగింది. డ్రైవరు దిగేడు. జనం మూగేరు.

ప్రాణం ఉందా .... ఏమిటేమిటి .... అయ్యయ్యో .... సచ్చిపోన్రా .... ఆస్పత్రి .... వేగిరం .... లాభంలేదు .... క్విక్, హాస్పటల్, అర్జంట్ .... మనిషి పోలికేలేదు .... రామరామ .... శివశివ .... నంబరు నోట్ చెయ్యండి .... కాల్ ది పులీస్ .... దట్ బగర్ ఆఫ్ ఎ డ్రైవర్ని పట్టుకోండి .... హాస్పిటల్, అర్జంట్ .... ఏమిస్పీడండీ .... ఓలమ్మో .... దూరంగా .... .... ఏం చేద్దాం .... గెటవుట్ యూ ఫూల్ .... ముట్టుకోకండి .... ఇంకేముంది .... చచ్చిపోయాడు?! తల పగిలేక ఇంకా ఉంటాడా .... ఎవరు వారు .... ఎవడువాడు .... ఎవడండీ వాడూ .... శ్రీరామచంద్ర .... లేచిన వేళావిశేషం .... కారెవడిది .... ఇంజనీరుగోరిది .... డ్రైవరేడీ .... ఎవడు వాడు .... ఇంక వాడి పనుంది .... నామీదికి ఎక్కిపోవలసిందండీ కారూ .... బ్లడీ రాస్కెల్ .... వెంట్రుకవాసిలో తప్పిపోయింది .... అమ్మా అని పిలుపులేదు .... చచ్చిపోయేడు .... డ్రైవరు తప్పులేదు .... ఓలమ్మో .... నీకేం తెలు .... ఉలే ఉలే .... ఎవడో పాపం ....

కళ్ళు నెత్తి కెళ్ళాయ్ ... కొట్లో వేసి కుళ్ళబొడాల .... మీరంతా దూరంగా ఉండండి .... పాపం డ్రైవోరు కానుకొనేదండీ .... నో యూజ్! హియీజ్ డెడ్ .... డెడ్ ఏజ్ ఎడోర్ మేట్! ... ఆ దొంగమేక ఇంతపనీ జేసిందండీ .... ఆహా! .... నాను సూత్తూండాను గానామరి .... అరే! మేకా? .... మేకట .... మేక .... మేకు గుచ్చుకుందా? .... ఎవడికి .... ఎక్కడెక్కడ .... దూరంగా వాడికా డ్రైవర్కా? డ్రైవరెవరో చూపించురా .... నన్ను ముందుకు వెళ్ళనివ్వండీ .... కాలు మట్టేసినాడ్రా... ఎవడ్రా? షటప్ .... యూ ఫూల్ .... అబ్బొసె .... బ్లెడీబగర్ .... కీస్ పాస్ .... మేక .... సివప్పన్నగాడి మేక ఎర్రదా - కాదురా, నల్లది .... మేకా లేదు గీకా లేదు... మేకు ఎక్కడండీ ఉంది నీ కేటెరిక.... మేకండీ నల్లమేక. నానుసూసినాను గానా మరి .... అవునండి నేకూడా చూసేను ఇటీజ్ ఆల్ డ్యూటు దట్ బ్లడీ గోట్ .... బాబూ తమరు చూసేరుకదా .... చూసేనయ్యా. నీకేం ఫర్వాలేదు .... చేతికి బేడీలేస్తే కళ్ళు కిందికి దిగుతాయి .... డాబామీద చూడ్రా .... ఒరే మాలచ్మీ .... ఓరి పోలిగా .... ఆ మేకని తప్పిద్దామనుకున్నానండీ సార్ సార్ బాబ్బాబు అదే నిజం నా పిల్లలు సాక్షిగా చెప్తున్నా.... హి మస్టు బి టేకెన్ టు ది హాస్పిటల్ ... నా మీద ఎక్కిపోవలసిందండీ .... చీమ దొర్లున్నప్పుడిలాటి దురన్నేయా ల్లేవు .... నీకేం ఫర్వాలేదయ్యా ఏడవకు .... ఆ మేక ఇంతపనీ చేసిందండీ .... ఆడమేక? మొగదా? ... అబ్బే, నల్లమేకండి .... అల్భూపోనారు. కరువు మానోకం వచ్చి పడిపోనాది .... దటీజ్ ట్రూ ఐ సే .... ఏ ఏ పోలిగాడేడి .... ముండ మాలచ్చి ఏదీ .... తొక్కమాక .... రకతం .... హమ్మో .... ఏమయిదండీ .... వెంట్రెవాసిలో .... ఆడదా మగదా ... నల్లమేకయ్యా అని సెప్తే ఇనవేటయ్యా .... ఏముంది .... అహ్మద్‌భయాకహారే .... మళ్ళీ తొక్కేసినాడ్రా .... డాబామీద చూశావురా .... ఆడదా .... మగదా .... వాడిలా ఒంగున్నాడండీ ... మేక ఇలా ఉరికిందండీ. అదిగో అతను కూడా చెప్తున్నాడు .... నీకేం ఫర్వాలేదయ్యా .... రామ రామ .... గుడ్ గాడ్ .... బాబ్బాబు నా పిల్లల సాక్షి ....

ఆఫీసరుగారి ప్రాణంపోయిన నౌకర్ని ఆస్పత్రికి తీసుకు వెళ్లేరు డ్రైవరు. పోలీసువారి చేతుల్లోకి వెళ్లేడు.

తోటమాలినీ, మోటారుకారునీ, చావుని తప్పించుకున్న నల్లమేక ఎక్కడో బలుసాకు తింటోంది.

ఒక మేకని చావునుంచి తప్పించబోవడం ఒక మనిషి చావుకు కారణం అయిందని సాయంకాలం అయేసరికి ఊరంతా తెలిసింది. ఈ రీతిగా ప్రమాదం జరిగిందని విన్నవారిలో కొంతమంది చనిపోయిన వాడికోసం విచారించేరు. కొంతమంది డ్రైవరుకోసం విచారించేరు. మేక బతికినందుకు మాత్రం ఎవ్వరూ సంతోషించలేదు.

ఈ లోపున -

రోడ్డుమీద ఎవరైనా అక్కడ ఆగ భయం; ఏదైనా కొద్దిగా అయినా నల్లగా ఉండే మేకరా భయం; తోటమాలీ "అదిగో అదిగో అదేనండి ఆ మేక" అని అందరికీ చూపిస్తూ వస్తున్నాడు తోట గేటు దగ్గర దారికాసి నిల్చొని.

